## ఫోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు

**20 వేల రూపాయల జరిమానా**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఫోక్సో కేసు కింద 20 సంవత్సరాల జైలు శిక్ష , 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని ఓ మండలానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాధిత మైనర్ బాలిక తన అమ్మ తో పాటు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది, వీరి ఇంటి పరిసర ప్రాంతంలో ఉండే మరప రామేశ్వర్ సదరు బాలిక కు 10-12-2023 న మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక తనకు కడుపునొప్పి విపరీతంగా వస్తుందని తన తల్లికి 12-12-2023 న తెలపటంతో, బాలికను అడుగగా తనపై జరిగిన లైంగిక దాడికి సంబంధించిన వివరాలు తెలిపిందని , ఈ వివరాలతో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైనూర్ పోలీస్ స్టేషన్ లో 12-12-2023 న ఫిర్యాదు చేయగా అప్పటి జైనూర్ ఎస్.ఐ ఎన్.సందీప్ కేసు నమోదు చేసి, అప్పటి డీఎస్పీ ఎం.వెంకటరమణ దర్యాప్తు చేసి కోర్టులో హాజరు పరచగా పి.పీ జగన్మోహన్ రావు, సీ.డీ.ఓ అండ్ లైజనింగ్ ఆఫీసర్ పీ.రాంసింగ్ సాక్షులను హాజరు పరచగా జడ్జి సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడు రామేశ్వర్ కు 20 సంవత్సరాల జైలు శిక్ష, 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డిఎస్పీ చిత్తరంజన్ , జైనూర్ సిఐ రమేష్ , జైనూర్ ఎస్సై రవికుమార్, కోర్టు పోలీస్ సిబ్బంది ని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ జెడ్పీహెచ్ఎస్ , గుడిహత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుడిహత్నూర్ మోడల్ స్కూల్ లలో 30 మంది పేద విద్యార్థులను గుర్తించి ప్రతి విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున అందించారు. గత పదేళ్లుగా ఈ సంస్థ ప్రతియేటా 30 మంది పేద విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మెన్ ఆడే శీల రాజేశ్వర్, ఉల్లాస్ ట్రస్ట్ మండల ప్రతినిధి సాంగ్లె చంద్రకాంత్, లింగాపూర్ మాజీ సర్పంచ్ సుభాష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్వహించే స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి ఎండి సద్దాం కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసి వైద్యాధికారి తోపాటు వైద్యురాలు ఇందూజ, మహిళలు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ముగుస్తుందన్నారు. ఈ అభియాన్ ద్వారా మహిళల ఆరోగ్యం, సాధికారత జాతీయ పురోగతికి కేంద్రీకృతమై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆరోగ్య శిబిరాల ద్వారా మహిళల ఆరోగ్య స్థితుల పట్ల ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల హెల్త్ సూపర్వైజర్లు అడిగాం సంతోష్, స్వర్ణలత, ఎంఎల్ హెచ్పీ ఎస్ వనిత, మౌనిక, వైష్ణవి, సంగీత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు చేయడం సరికాదు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** నిజామాబాద్ జిల్లా ఎర్రగడ్డ మండలం తల్లారాంపూర్ గ్రామంలో గౌడ కులస్థులపై జరిపిన దాడిని ఆదిలాబాద్ జిల్లా మొక్కుదెబ్బ ప్రధాన కార్యదర్శి అరుగుల సంతోష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘంల చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ను నిర్మల్ జిల్లా కేంద్రంలో హౌస్ అరెస్ట్ చేసి అర్ధరాత్రి పోలీస్ స్టేషన్ కు రావాలని వేధించిన సీఐ, ఎస్సై సహా పది మంది పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా గౌడ హక్కుల పోరాట సమితి మొక్కుదెబ్బ తరుపున సంతోష్ గౌడ్ డిమాండ్ చేశారు.

# 60 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునికరణ



- ఎంపీ గోడం నగేష్
- వందే భారత్ హాల్టింగును ప్రారంభించిన ఎంపీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** సిర్పూర్ కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఆధునికరణ కోసం కేంద్ర ప్రభుత్వం , రైల్వే మంత్రి అశ్విని వైభవ్ ఆధ్వర్యంలో 60 కోట్లు రూపాయలు నిధులు మంజూరు చేసిందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. గురువారం కాగజ్నగర్ రైల్వే స్టేషన్ లో సికింద్రాబాద్ - నాగపూర్ వందే భారత్ సెమీ హై స్పీడ్ రైలు హాల్టింగ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల్లో నాలుగు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే సిర్పూర్ టౌన్ లో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేస్తున్నదని తెలిపారు. బిజెపి తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతున్నదని , ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడానికి జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, రైల్వేస్టేషన్ లు ఆధునికరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతక ముందు సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్ నగర్ మధ్య మరో కొత్త రైలును ప్రవేశపెట్టాలని, చర్లపల్లి - హౌరా వయా సిర్పూర్ కాగజ్నగర్ కొత్త రైలు మంజూరు చేయాలని ఎంపీని, రైల్వే అధికారులను కోరారు. ఏడాదికాలంగా తాను, ఎంపీ ఎంతో వ్యయప్రయాసల కోర్చి ఈ హాల్టింగ్ సాధించామని తెలిపారు. పట్టణ , పరిసర ప్రాంతాల ప్రజలు వందే భారత్ ఎక్స్ప్రెస్ ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంజీవయ్య కాలనీ వద్ద అండర్ బ్రిడ్జి , చింతగూడ రైల్వే క్రాసింగ్, ఈస్గాం రైల్వే క్రాసింగ్ వద్ద ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయని, కొత్త రైళ్ల హాల్టింగ్ తో కాగజ్ నగర్ లో వందకు పైగా రైళ్లు ఆగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, రైల్వే శాఖ రాష్ట్ర అధికారులు, బీజేపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సగం జీతాలంటే బతుకుడు ఎట్లా



**ఉద్యమ కెరటం, నర్సాపూర్ (మెదక్):** చాలీచాలని వేతనాలతో జీవితాలు గడుపుతున్న తమకు సగం జీతాలు కోత విధించడంతో ఎలా బతకాలి అంటూ మైనారిటీ గురుకుల ఔటసోర్సింగ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం తమ విధులు బహిష్కరించి పాఠశాల ఎదుట ప్లాకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మైనారిటీ1 పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ నసీమ షేక్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఓమన్నారు. సమయానికి జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలలో సగం కోత విదిస్తూ జీఓ నెంబర్ 1437 తీసుకురావడం అన్యాయమని, వెంటనే జీ ఓ రద్దు చేయాలని కోరారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వండి

**సీఎం రేవంత్ రెడ్డిని కోరిన నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**



**ఉద్యమ కెరటం, నర్సాపూర్ ( మెదక్ ) :** నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికీ కోరారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, అంతారం గ్రామాన్ని కౌడిపల్లి మండలంలో కలపాలని, నర్సాపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. నియోజకవర్గ కేంద్రంలో కోర్టు భవనం, ఆర్డీఓ, ఎమ్మార్వో, అగ్రికల్చర్ కార్యాలయాలు నిర్మించాలని, కొత్తగా ఏర్పడిన చిలిప్‌చేడ్, మాసాయిపేట మండల కేంద్రాల్లో ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్ అండ్ బి శాఖ నిధుల నుండి రహదారి విస్తరణకు రూ.156 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ కింద రహదారులు,వంతెనల నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.వాటిలో హైదరాబాద్ మెదక్ పిడబ్ల్యుడి రోడ్ నుండి దౌల్తాబాద్ చిట్కుల్ శీలంపల్లి వరకు కొనంపేట రహదారి అభివృద్ధి, రాజీపేట్, తిమ్మాపూర్ , జాజీ తండా మార్గం వద్ద హెచ్ఎల్ బి వంతెన నిర్మాణం, ముచ్చర్ల ఎల్లాపూర్ రహదారి అభివృద్ధి పిల్లికుంట్ల తండా దౌజా తండా రహదారి, సికింద్లాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రహదారి , సీతారాంపూర్ హెచ్ఎంబి పిడబ్ల్యుడి రోడ్డు రహదారి, గుండ్లపల్లి మధిరా నర్సాపూర్ రహదారి, రుస్తంపేట్ రామచంద్రాపురం రహదారి అభివృద్ధి, నర్సాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పరచడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.అన్ని అభ్యర్థనల పై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

## ఈసీజీ మిషన్ ఉంది.. కానీ పేపర్ లేదు

**ఇది బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి తీరు**




**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసీజీ అందుబాటులో ఉన్నప్పటికీ అందులో పేపర్ లేదు. అన్ని ఉండి అల్లుడి నోట్లో శని అన్న చందనంగా బోథ్ ఏరియా ఆసుపత్రి సాగుతుంది. ఆసుపత్రికి మండల వాసులే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల వారు వైద్యం కోసం వస్తుంటారు. సరైన సమయంలో వైద్య సేవలు అందిస్తేనే ప్రాణాలు నిలుస్తాయి.. లేదంటే సీరియస్ కేసులు వేరే ప్రాంతాలకు తరలించే క్రమంలోనే ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందించాలనే ప్రత్యేక దృష్టి పెట్టింది.. కానీ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారింది. ల్యాబ్ పరీక్షలు చేసి పేపర్ లేదని రిపోర్ట్ ఇవ్వడం లేదని పలువురు అంటున్నారు. ఈసీజీ ప్రింట్ తీయడం కోసం పేపర్ లేకపోవడంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. బోథ్ పట్టణానికి చెందిన వ్యక్తి బుధవారం మధ్యాహ్నం ఛాతి నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే ఈసీజీ తీసి రిపోర్టు సరిగ్గా రావడం లేదని అన్నారు. పరీక్షించిన వైద్యులు ఈసీజీ తీశారు. ఆదిలాబాద్ ఆసుపత్రి కి రిఫర్ చేశారు. కానీ ఈసీజీ పేపర్ లేకపోవడంతో బాధితుడి కుటుంబీకులు ఆదిలాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈసీజీ తీయించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతనికి అప్పటికే గుండెపోటు వచ్చిందని తెలుపడంతో కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధితుడికి హార్ట్ స్ట్రోక్ రావడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో రెండు స్టంట్ లు వేశారని కుటుంబికులు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసీజీకి సంబంధించిన పేపర్ ను వెంటనే తెప్పించాలని పేర్కొన్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కూనమళ్ళ రవి కుమార్ ను గురువారం పట్టణ యువకులు అడగగా, ఈసీజీకి సంబంధించిన పేపర్ అయిపోయిందని, తెప్పిస్తున్నామని అన్నారు. ఆస్పత్రికి వచ్చేరోగులకు మెరుగైన వైద్య సేవలు అందేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

